# నిర్ణయానికి అటూ ఇటూ

**-ఇంద్రగంటి జానకీబాల**

సావిత్రి ఆలోచించి నెమ్మదిగా దిగి, అతనికి డబ్బులిచ్చి ఎదురుగా వున్న ఖరీదైన ఇంటివైపు కాస్త ఆశ్చర్యంగా చూసింది. కుడిచేతిలో వున్న చిన్న బ్యాగును ఎడం చేతిలోకి మార్చుకుని గేటు తీసుకుని లోపలికి అడుగు పెట్టింది. చక్కని పూలమొక్కలతో నిండుగా ఎంతో అందంగా వుందా వాతావరణం. వీధి తలుపు తీసే వుంది. కళ్ళెత్తి ఎదురుగా వున్న చెల్లెలు సునీతను చూడంగానే ఒక్కసారి ఒళ్ళు జలదరించింది సావిత్రికి. అది ప్రేమో - జాలో - భయమో- ఏమో ఏదీ విడమర్చి చెప్పలేని ఒక భావం. ఒక బాధ ఆమెని ఒక్క క్షణం కుదిపేసింది. అంతలో సునీత అక్కని చూసి ఆశ్చర్యంతో 'రావే అక్కా! రా' అని గట్టిగా అరిచింది. సావిత్రి పరుగులాంటి నడకతో ఆమెని చేరింది. ఆసరాగా వున్నదాన్ని వదిలేసి అక్కయ్య భుజంమీద చేతులు వేసింది సునీత. ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర.

" ఎన్నాళ్ళకొచ్చావే - ఇన్నాళ్ళకి నా మీద ప్రేమ కలిగిందన్నమాట - నేను గుర్తుకొచ్చానన్న మాట - సునీత గొంతు బొంగురుపోయింది. ఇద్దరూ అక్కడే వున్న సోఫాలో కూలబడ్డారు. సావిత్రి వెంటనే ఏం మాట్లాడలేకపోయింది.

"లక్ష్మీ! లక్ష్మీ! చల్లటి మంచినీళ్ళు పట్రా" అంటూ అరిచింది సునీత.

సావిత్రి నెమ్మదిగా గొంతు పెగుల్చుకుంది. "ప్రేమలకేం బోలెడున్నాయి. గుర్తుకు రావడానికి నేను మర్చిపోతే కదా! అయినా నాకు క్షణం ఇల్లు వదిలి రావడానికి కుదరదని నీకు తెలీదా ఏం?" అని చెల్లెలివైపు నిశితంగా చూసి "ఏమిటే నువ్విలా అయిపోయావు? బొత్తిగా నడవలేక పోతున్నావా" అంది.

"ఏం చెప్పను? నా ఖర్మ. కీళ్ళ వాతం మోకాళ్ళ నొప్పులు అంటే ఏమో అనుకుంటారు. కానీ అడుగుతీసి అడుగువేయలేకపోతున్నాను. ఇదిగో ఈ వాకర్ పెట్టుకుని నాలుగడుగులు వేయడమే గగనంగా వుంది. ఎవరో ఒకరు నాకోసం వుండాల్సిందే - ఇంట్లో ముగ్గురు పనివాళ్ళు. ఇళ్ళూ, బట్టలు అంట్లు ఒకరు - వంటచేసి, వడ్డించడానికి మరొకామె. ఇదిగో ఈ లక్ష్మి రోజస్తమానూ నాకు సాయంగా వుంటుంది. ప్చ్! సరేలేగానీ - బావ గారెలా వున్నారు"


"ప్చ్! ఎలా వుంటారు? వారమేసి రోజులు మంచం మీంచి లేకలేకపోతున్నారు. బాత్‌రూంకి కూడా పట్టుకుంటే గానీ వెళ్ళలేరు. అందుకే నీ గురించి తెలుస్తున్నా రాలేకపోయా - మరిది గారేరి?"

"ఇప్పుడే బయటకెళ్ళారు. ఓ గంటలో వస్తారు." అంది సునీత.

"అవునూ - బట్టల రాముడొచ్చి చెప్పాడు ఇద్దరూ వృద్ధాశ్రమంలో చేరుతున్నార్ట. నిజమేనా" సావిత్రి గొంతులో ఒక బాధ ధ్వనించింది. వెంటనే సునీతే సమాధానమూ చెప్పలేదు. తలొంచుకుంది. బాధతో ఆమె కళ్ళల్లో నీళ్ళూరాయి. తల కదిలిస్తే అవి జలజలా రాలుతాయి. సావిత్రా సంగతి గ్రహించింది.

"ఏమొచ్చింది? పెద్ద ఇల్లూ, వాకిలీ - డబ్బూ అన్నీ వున్నాయి. మీరు మిగిల్చి పిల్లలకి యివ్వాలనే బాధ లేదు. ఖర్చు పెట్టుకోండి. డబ్బుపెట్టి నౌకర్లను పెట్టుకోండి" అంది సావిత్రి.

"నిజమేనే అక్కా! అంతా నిజమే. నేనంటూ అస్సలు లేవలేకపోతుంటే నౌకర్లతో గడిచే మాటే నంటావా? ఎంత డబ్బు యిచ్చినా వాళ్ళు అప్పుడప్పుడు మానేస్తారు. ఆరోజు ఇంట్లో నరకమే. తెల్లారి లేస్తూనే కాఫీ లేకపోతే ఆయన కేమో ఒకటే విసుగు, కోపం. నేను కదల్లేక పోతున్నాను. నేను లేచి పనిచెయ్యకపోతే ఇల్లెలా గడుస్తుంది? ఆయనకేమో అస్సలు పనిరాదు. స్టవ్ వెలిగించటం రాదు. పాలు కాయడం రాదు.




పట్టుకారుతో గిన్ని పట్టుకోవడమే రాదు. నేనేం చెయ్యను? ఆయన లేస్తూనే కోపంతో చిందులు వేస్తుంటే నాకు ప్రాణం చచ్చిపోయినట్లుంటుంది. నేనింత దురదృష్టవంతురాలినేమాని ఏడుస్తూ వుంటాను. ఆయిగా ఆయనకింత వండిపెట్టే అదృష్టం, ఆయనకి సేవచేసే భాగ్యం లేకపోయిందే అని కుమిలిపోతున్నాను" సునీత గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

సావిత్రి నెమ్మదిగా చెల్లెల్ని వీపురాస్తూ ఓదార్చింది. పది నిమిషాలకి సునీత తన బాధ నుంచి తట్టుకుంది.

"నా గోలకేంగానీ, నువ్వెలా వున్నావు? నీ ఆరోగ్యం బాగుంది కదా? బావగారు మంచంలోనే వున్నా, నువ్వు బాగున్నావు కనుక మీ సంసారం సజావుగా సాగిపోతోంది. నువ్వు అదృష్టవంతు రాలివి. మొగుడికింత చేసి పెట్టుకోవడం కంటే

ఏంకావాలి చెప్పు"

సావిత్రి మనసులో ఎక్కడో సన్నటి చీపురుముల్లు గుచ్చుకున్నట్టు విలవిల్లాడింది.

"ఏం అదృష్టమో - ఏం ఆరోగ్యమో - ఏమే సునీ, నీ కంటే నేను ఏడేళ్ళు పెద్దదాన్ని. నాకు మాత్రం ఓపిక ఎక్కడ్నించి వస్తుంది! గుండెల్లో బరువు -, ఒకటే ఆయాసం - కాస్త పనిచేస్తే ఆయాసం. ఇంట్లో పని తప్పదు. ఆయనకి సేవ తప్పదు. రాత్రి కంటిమీద కునుకు కూడా నమ్మకంలేదు. ఒక్కోసారి మంచి నిద్రలో వుండగా 'సావిత్రీ - సావిత్రీ' అంటూ పిలుస్తారు. బాత్‌రూంకి వెళ్ళాలనో - మంచినీళ్ళు కావాలనో -, ఫ్యాను తగ్గించమనో - , దుప్పటి సరిచేయమనో అలా లేస్తే నాకు మళ్ళీ నిద్రపట్టదు. పొద్దున్నే లేవక తప్పదు. లేస్తే నీరసం, ఎప్పుడైనా ఓ అరగంట ఆలస్యంగా లేస్తే మీ బావగారు రంకెలు వేస్తూ వుంటారు.

"ఇంత మొద్దు నిద్రేమిటే నీకూ - నాకు గాభరాగా వుంది. తొందరగా కాఫీ కలుపు", అంటూ ఇల్లు ఎగరగొడతారు. అక్కడితో ఆగరు తెలుసా. 'నీకు నా పనులు విసుగ్గా వుంటే ఇంత విషమిచ్చి చంపేయ్ పీడా విరగడైపోతుంది. ఏం ఫరవాలేదు. అలనాడు సావిత్రి యముడితో పోట్లాడి మొగుడ్ని బతికించుకుంది. ఇప్పుడు నువ్వు ఆధునిక సావిత్రివి కదా యముడి దగ్గరకు పంపేయ్' ఇలా ఏవేవో మాట్లాడతారు. ఓపిక తెచ్చుకుని పని చెయ్యడమే" సావిత్రి ఆపింది.

"అబ్బబ్బ! ఆపవే-, అక్కా! పాపం ఆయన మంచంలో వుండి వుండి ఎంత విసిగిపోయి వుంటారో అర్థం చేసుకోవాలి"

"అవున్లే! ఆయన విసిగిపోతున్నారు. నేనెంత అలసిపోతున్నానో ఒక్కసారి ఆలోచించి చూడు - నా అనారోగ్యం, నా శక్తి లేకపోవడం ఎవ్వరూ పట్టించుకోరు - అందరి సానుభూతీ ఆయనమీదే" సావిత్రి మాటల్లో రోషం, దుఃఖం వున్నాయి.

"ఎందుకు పట్టించుకోరు? అయినా నీకేమంత అనారోగ్యం లేదుగా, నాలా మోకాళ్ళ నొప్పులతో అసలు నడవలేకపోవడం, నిలబడలేకపోవడం లేదుగా"

"అంటే - నువ్వు నిలబడలేకపోవడమొక్కటే న్యాయబద్ధమైన కారణమా" సావిత్రి సూటిగా అంది.

"మరి?!"

"నాకు గుండె దడదడలాడినప్పుడు పడుకుంటే అరగంట వరకు లేవలేను తెలుసా"

"పోనీ ఆ తర్వాత లేస్తావుగా" సునీత ఠపీమని అంది. సావిత్రి చెల్లెలి ముఖంలోకి విస్మయంగా చూసింది. కానీ అప్పుడు సునీత అక్క వైపు చూడటంలేదు. లోపలికి చూపు తిప్పి "లక్ష్మీ" అని పిలుస్తోంది.

'లక్ష్మీ కాస్త ఉప్మా చెయ్యి - అక్కయ్య వచ్చినప్పట్నించీ కబుర్లలోనే పడిపోయాం" అంది.

సావిత్రి కూడా నర్దుకుంది. "వచ్చి మిరపకాయలు, అల్లం తరిగిపెట్టు - నేనొచ్చి చేస్తా ఉప్మా" అంది సావిత్రి.

"అక్కా! నీ చేతి వంటతిని ఎన్నాళ్ళయిందో" అంది సునీత ఆనందంగా.

"ఇంతకీ - మీరెళ్ళడం నిజమేనా" సందేహంగా అంది సావిత్రి.

"నిజమే. ఆయన ఎనభైవేలు ఆశ్రమానికి కట్టారు. మాకో గది ప్రత్యేకం ఇస్తారు. కాఫీలు, టిఫెన్లు, అన్నాలు, మందులు, డాక్టర్లు, అన్నీ వాళ్ళే చూస్తారు. మా ఆయనకి పుస్తకాలుంటే మరేం అక్కర్లేదని నీకు తెలుసుగా"

"అదేవిట్లే 'గాలితోబాటుగా రామాహరీ వారు గారెలే తింటారు రామాహరీ' అన్నట్లుగా వట్టి పుస్తకాలతోనే సరిపోతే బాధేముంది? ఇన్ని కష్టాలెందుకు? అన్నపానాదులు కావాలి కనుకనే కదా ఈ తిప్పలు" సావిత్రి మాటలు పూర్తవుతుంటేనే సునీత గలగలానవ్వి

"భలే చెప్పావే అక్కా" అంది.

"బాత్‌రూం ఎటూ" అంటూ సావిత్రి నెమ్మదిగా లేచింది.

★★★

గొప్ప ప్రొఫెసర్‌గా వుద్యోగం చేసి, పుస్తకాలు రాసి, ప్రచురించి పేరు ప్రఖ్యాతులు సంపాదించి రిటైరై హాయిగా, ఆరోగ్యంగా తిరుగుతున్న వివేకానందకి భార్య సునీత మోకాళ్ళ నొప్పులతో

కదలలేకుండా పోవడం పెద్ద ఎదురుదెబ్బగా తయారైంది. అతనికి భార్య మీద ప్రేమ లేదంటే అన్యాయమే. ఆమె ఓపికగా అన్నీ అమర్చి, అతన్ని ప్రేమగా ఆదరించి, వినయంగా మాట్లాడి, సౌమ్యంగా సహకరించినంతకాలం అతను భార్యను పల్లెత్తుమాటని ఎరుగడు. సునీత కూడా భర్తని దేవుడిలా చూసుకుంటూ వచ్చింది. ఏమిటో దేవుడే వాళ్ళని చల్లగా చూడలేక పోయాడు.

'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం' అని కాళిదాసు అలనాడు పార్వతిని సున్నితంగా మందలించాడు. ఆరోగ్యం జాగ్రత్త. తర్వాతే తపస్సూ అదీ అంటూ హెచ్చరించాడు. పాపం! సునీత కన్నీ తెలుసుకానీ ఆమె చేతిలో వున్న విషయం కాకుండా పోయిందీ కీళ్ళవాతం. ఏమేమి మానేయాలో డాక్టరు చెప్పగా తు.చ. తప్పకుండా మానేసింది. ఒళ్ళు తగ్గించింది. కానీ మోకాళ్ళలో కీళ్ళు అరిగిపోయాయంటే ఆమేం చేస్తుంది? కటక్‌కటక్ మనే శబ్దంతో, సలపరింపులతో బాధపడుతూనే, నోరు మెదపకుండా ఓపికున్నంత వరకు చేసుకుంటూ వచ్చింది.

అందరి పిల్లల మాదిరిగానే వాళ్ళ పిల్లలూ అవకాశాలొచ్చి రెక్కలు కట్టుకుని అమెరికా రివ్వున ఎగిరిపోయారు. నిజమే మరి - మనకున్న చిన్న చిన్న బాధలతో పిల్లల భవిష్యత్తు పాడుచేస్తామా!

ఈ నాలుగేళ్ళలో సునీత కనీసం క్షణకాలం కూడా నిలబడలేని స్థితి కొచ్చింది. మింగే మందులు మింగుతున్నా రోగం ఎక్కడుందో అక్కడే వుండక ముందుకు సాగుతోంది. ఆపరేషన్ గురించి ఆలోచన రాకపోలేదు. అవన్నీ వివేకానందకి విసుగు. అందుకే ప్రస్తుతం ఆ సంగతి పక్కన పెట్టాడు. అతనికిప్పుడు వెంటనే కావలసింది జీవితం సజావుగా, వేగంగా, ఉత్సాహంగా గడవడం. అందుకే అతను "ఇద్దరం ఓల్డేజ్ హోంకి వెళ్దాం" అన్నాడు. సునీతకి చెప్పేందుకు సమాధానమేం లేదు. మౌనమే అంగీకారం. అతనికి పుస్తకాలంటే ఇష్టం. రాసుకోవడమంటే ఇష్టం - మేధావులతో సంభాషణలంటే ఇష్టం - అతనికొచ్చే కీర్తి ప్రతిష్ఠలంటే ఇష్టం. అతనక్కడున్నా ఇవన్నీ అతనికి కావాలి. అతనికోగది, అందులో స్నేహితులు - అతనికో షెల్ఫ్ అందులో అతనికిష్టమైన పుస్తకాలు - అతనికో మంచం దానిమీద మెత్తని పరుపు. - అతనెక్కడ వున్నా అతని ప్రపంచం అతనితో వుంటుంది.

సునీత కాయిల్లంటే ఎంతో యిష్టం. పిల్లల ఆటపాటలతో అలరారిన ఆ యిల్లంటే ఆమెకి స్వర్గం. ఆ పూల మొక్కలంటే ప్రాణం. ఆ మల్లెలు, ఆ జాజులు, ఆ కనకాంబరాలు, ఆ చామంతులు ఆ పూలంటే ప్రేమ. కానీ వీటివేటినీ ఆమె నిలబెట్టుకోలేదు. తనతో తీసుకెళ్ళలేదు. ఆమె ముదులు వేసుకున్న ఆమె ప్రపంచం ఆమెతో ముడివడిలేదు. తనకంటూ నిర్ణయం లేదు. ఎన్నోసార్లు సునీత అనుకుంది. తన భర్త కాస్తంత సహకరిస్తే తన అందమైన ప్రపంచాన్ని నిలబెట్టుకోగలదు.

కానీ మగవాడిగా అతనికా అవసరం లేదు.

వేడి వేడి ఉప్మా ప్లేట్లలో పెట్టి తెచ్చింది సావిత్రి. ఆమె వెనకాలే లక్ష్మి గ్లాసులతో మంచినీళ్ళు పెట్టి వెళ్ళిపోయింది.

"మరిప్పుడు బావ గారి దగ్గరెవరున్నారు చూసేందుకు" అంది సునీత.

"మొన్న విజ్జి వచ్చింది వాళ్ళన్నయ్యను చూద్దామని - ఓ వారం వుంటానని చెప్పింది. నేను అడిగాను ఒక్కసారి మా సునీని చూసివస్తా మీ అన్నయ్య దగ్గరుంటావా అని - అలాగే వదినా పాపం సునీతస్సలు

## ఎక్స్ఛేంజ్

**లం**చ్ అవర్‌లో ఆఫీస్‌లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు ఓ హోటల్‌కి వెళ్లి తమ టిఫిన్ కేరియర్లు విప్పి ఇంటి నుండి తెచ్చుకున్న అన్నం తినడానికి ఉపక్రమించారు. అది గమనించిన ఆ హోటల్ ప్రొప్రయిటర్ వాళ్ల దగ్గరికి వచ్చి చెప్పాడు. 'ఎవరిళ్ల నుంచి తెచ్చుకున్న భోజనం వాళ్లు నా హోటల్‌లో తినకూడదు'. 'అలాగా! సరే' అని ఆ ఇద్దరూ తమ తమ భోజనాలని ఎక్స్ఛేంజ్ చేసుకుని తినసాగారు.

**- ఎం.కావ్య**

నడవలేకపోతోందటగా అంది - నేను సరేనని అన్ని సర్దుబాట్లూ చేసి ఒక్కరోజు కోసం ఇలా వచ్చాను" -

"అదేమిటే ఒక్క రోజేనా"-

"ఇంకా నయం. మా ఆడబడుచుల్లో ఆ పిల్లొకతే కాస్త మంచిది పాపం! అడగ్గానే సరేనంది"

ఇద్దరూ ఉప్మా ఊదుకుంటూ తింటూ కాస్సేపు మరేం మాట్లాడకుండా కూర్చున్నారు.

"ఈ ఇల్లు ఏం చేస్తారు?"

"అద్దెకిచ్చేశాం - నెలకి పదివేలు - ఫస్టుకొచ్చి చేరుతారు"

వివేకానంద వస్తూనే వదినగార్ని పలకరించి క్షేమ సమాచారాలు అడిగాడు. నాలుగు రోజుల్లో తనూ, సునీత ఓల్డేజ్‌హోంకి వెళ్ళిపోతున్నట్లు ఆనందంగా చెప్పాడు.

"అదేదో వేరే చోటుగా బాధపడాల్సిందేం లేదు. మనకి చేతకానప్పుడు అదే మంచి మార్గం. ఆలనా పాలనా వుంటుంది. ఆడది ఇంట్లో ఆరోగ్యంగా తిరుగుతూ, పనిపాటలు చేసుకోలేక పోతే ఎంత నరకమో నాకిప్పుడర్థమవుతోంది" అంటూ వివేకానంద కలుపుగోలుగా మాట్లాడాడు.

ఎప్పుడో ఈ వివేకానంద నోటి వెంటనే విన్న మాటలు సావిత్రికి గరగరమంటున్న పాత సినిమా డైలాగుల్లా చెవుల్లో వినిపించటం మొదలైంది.

తిండియొకపక్క వెలితిగా దినగవలయు
చెప్పకయె యింటి పనులెల్ల జేయవలయు
ఊరికే కొట్టినను పడియుండవలయు
ఇట్టి కన్యను వెతికి గ్రహింపవలయు- అంటూ

ఇల్లెగిరిపోయేలా, రాగ యుక్తంగా నవ్వుతూ అతను చదివిన కాళ్ళకూరి నారాయణరావుగారి పద్యం గుర్తుకొచ్చింది సావిత్రికి. అతను వాక్చాతుర్యంతో చుట్టూ బంధువుల్ని కూర్చోబెట్టుకుని అలరించిన ఆ రోజులు మనసులో మసగ వేస్తున్నాయి.

***

"నీ చెల్లెలి ఖర్మకాలి, కాళ్ళు పడిపోయి, వాళ్ళు వృద్ధాశ్రమంలో చేరుతున్నారు. నీకేం పొయ్యే కాలం వచ్చిందే? నువ్వు బాగానే వున్నావుగా - పని చేస్తున్నావుగా" మంచంలోంచి మహర్షి అరుస్తున్నాడు.

"చేస్తున్నానూ అంటే విధిలేక, తప్పనిసరై చేస్తున్నా - నిన్న డాక్టరేం చెప్పాడు? హార్ట్ ఎన్‌లార్జ్‌మెంటయిందీ... విశ్రాంతిగా వుండమనలేదూ" సావిత్రి సాగదీస్తూ చెప్పింది.

"అవునూ! ఆ గుప్పెడు మెతుకులు వండి పడేశాక నీకు విశ్రాంతిగాక పనేం చచ్చింది?"

"నా కెంత బాధ వుందో మీ కెంత చెప్పినా అర్థం కాదు"

"ఎందుకు కాదూ! అదిగో మీ చెల్లెలు కాపురం చూశాక నీకీపాడు బుద్ధి పుట్టింది. నాకీ ఇంట్లోనే బాగుంటుంది. నా జీవితం ఇక్కడే వెళ్ళిపోవాలి. నేనెక్కడికీ రాను. ఇదే నా నిర్ణయం నువ్వేం చేసుకుంటావో చేసుకో" మహర్షి వంట్లో శక్తి తగ్గినా కంఠం కంచుకంఠమే.

సావిత్రేం మాట్లాడలేదు. అతనికున్న ఆ నిర్ణయించే అధికారం గురించే ఆలోచిస్తోంది. అతనే మళ్ళీ అందుకున్నాడు.

"నువ్వు చేసుకున్న పుణ్యం వల్ల నీ మొగుడికింత చేసుకోగలుగుతున్నావని గ్రహించు. అదే నీ చెల్లెలు ఆ మాత్రం చేసుకోలేక అఘోరిస్తోంది"

"ఇంక - నా గుండెలో ఊపిరున్నంత కాలం ఇలా చాకిరీ చేస్తూ వుండాల్సిందే - ఒక్కసారే విశ్రాంతి" సావిత్రి నిరాశగా అన్నప్పటికీ కాస్త గట్టిగానే అంది.

"ఎవరికే నువ్వు చాకిరీ చేస్తున్నది? ఎవరికి? కట్టుకున్న మొగుడికేగా - అంత మాత్రానికి అలా చచ్చిపోతావేం?" ఈ వాదం ఎప్పటికీ తేలేది లేదని, తెగేది కాదనీ సావిత్రి గ్రహించింది. ఆమె గుండె బాగా బరువెక్కింది. అక్కడే ఎడం చేత్తో గుండె అదుముకుంటూ చతికిలబడింది.

కోర్టులో బోనులాంటి 'యూ' ఆకారం వాకర్ పట్టుకుని నెమ్మదిగా గెంతుకుంటూ న్యాయం కోసం సునీత ప్రపంచమంతా తిరుగుతున్నట్లు కనిపిస్తోంది సావిత్రికి. ఆ దృశ్యానికి నేపథ్య సంగీతంలా మహర్షి మాటలు దూరంగా వినిపిస్తూ సాగుతూనే వున్నాయి.

★